# ఇనప సంకెళ్లు

* శ్రీ దండమూడి మహీంధర్ కుమార్ *

శుష్కించి, కృశించి పోయిన శరీరం. ముఖంలో దీనత్వం తొంగి చూస్తోంది. గ్రుడ్డివాడు. భిక్షుకుడు. మనం చూడగలుగుతున్నాం. ప్రపంచంలో మంచీ—చెడూ—రెంటినీ విమర్శించు కోగలుగుతున్నాం. కాని ఆ గ్రుడ్డివాడు కేవలం శబ్దాన్ని వినగలుగుతున్నాడు. కర్కశస్వరాన్ని, కోమల శబ్దాన్ని విని మనస్సులో మానవుల్లో వున్న మానవత్వాన్ని, రాక్షసత్వాన్ని మాత్రంవిమర్శించుకోగలుగుతాడు. అతనికి ప్రపంచాన్ని కళ్లారాచూచే భాగ్యంలేదు. అతనికి చెవులే అతని కళ్లు. అతని ప్రక్కవున్న ఆ తొమ్మిదేళ్లకుర్రాడు పావలో, బేడో సంపాదించి ముసలి గ్రుడ్డిని బ్రతికిస్తున్నాడు.

నేను వాళ్లిద్దర్ని, అదేచోట-చౌక్ల్, అదేగోడప్రక్కన—నీటిపంపుకు దగ్గరగా మిఠాయి దుకాణానికి—ఎదురుగా, వచ్చేపొయ్యేవాళ్లని ప్రార్థిస్తూన్న కుర్రాణ్ణి, ముసలి వాణ్ణి చాలా మార్లు చూశాను. అనేక సార్లు వీలు చిక్కినప్పుడెల్లా పలకరిస్తూవుండే వాణ్ణి ఇద్దర్నీ. నేను ఎప్పటిలాగానే ఆరోజు కూడా సాయంత్రం చౌక్ కు వచ్చాను. అలవాటు ప్రకారం నా నేత్రాలు అటువేపే తిరిగాయి. ముసలాడి ప్రక్కన కుర్రాడు లేడు. నేను విస్తుపోయాను. ముసలివాడొక్కడే దించుకపోయిన డొక్కను చూపిస్తూ దీన వదనుడై "బాబూ! ఒకకాసీ!! ప్రొద్దుట్నించి యేమీ తినలేదండీ!!" అని వచ్చేపొయ్యేవారిని ప్రార్థిస్తున్నాడు.

జరీపంచె ధరించినాయన 'చస్తే ఫరవాలేదులే' అనే దృక్కుల్ని ముసలాడిమీద ప్రసరింపచేస్తు చక్కా వెళ్ళిపోతున్నాడు. ఆకలి దప్పులకు అర్థం తెలిసిన మరోతను తన చిరిగిన పంచెనుండి యేదో కొంతతీసి ముసలాడిచేతిలో పడేసి పోతున్నాడు.

దగ్గరగావెళ్ళి 'కుర్రాడే'డని ప్రశ్నించాను ముసలాణ్ణి. కృంగిపోయిన కంఠంతో "ఎక్కడికో పారిపోయాడ"ని చెప్పాడు. ఆ కుర్రాడు అప్పుడప్పుడు ఎక్కడో పారిపోయి రెండు మూడురోజుల్లో తిరిగి వస్తాడట! అయితే పాపం ముసలాడిసంగతి యేమవుతుంది?

* * *

మరొకరోజు నేను వారిద్దరిని యథాస్థానే చూచాను. కాని మరోరూపంలో! కుర్రాడి కాళ్ళకు 'ఇనప సంకెళ్లు'న్నాయి. మరల మామూలుగానే వచ్చేపొయ్యేవారిని పైసాలకోసం ప్రార్థిస్తున్నాడు.

నేను ముసలాణ్ణి సమీపించి కుర్రాడి కాళ్ళకు ఇనపగొలుసులెందుకని ప్రశ్నించాను. "బాబూ! వీడు వెనుకటిలాగా పారిపోతే నా గతేంకావాలి? ఎక్కడికీ వెళ్ళడానికి వీలులేకుండా కాళ్ళకు ఇనప సంకె

ళ్ళను నేనే వేయించాను. ఇకముందు వీడు యెక్కడికీ పారిపోలేడని వణుకుతూన్న గొంతుకతో చెప్పాడు.

* * *

రావుబహదూర్ రాజారావుగారి కారు వస్తూంది. ఆ రోజు చాలా వేగంగా వురకలెడుతూ పరుగెత్తుతూంది.

ఇనపగొలుసులతో బంధింపబడియున్న కుర్రాడు మిఠాయికోసం యెదురుగావున్న దుకాణానికి బయలుదేరాడు. రోడ్డుమధ్యకు చేరాడు. కాని బహదూర్‌గారి కారు వేగంగా వస్తూంది. కుర్రాడు తప్పుకోవాలని ప్రయత్నించాడు. బేడీల బంధంలో వున్న కుర్రాడు త్వరగా అటూ యిటూ కూడా వెళ్ళలేక పోయాడు. కారు కుర్రాడి మీదుగా నడిచింది. కాళ్ళ సంకెళ్లు సడలింపబడ్డాయి. కుర్రాడి ప్రాణాలు మరో లోకానికి పారిపోయాయి. జనం ప్రోగయ్యారు. 'కుర్రాడు చనిపోయాడ'ని వాళ్ళనుకునే మాటల్ని విని ముసలాడు బావురుమని యేడవటం మొదలుపెట్టాడు. అంతా అయ్యో! పాపంఅన్నారు. రావుబహదూర్ గారు 'గ్రుడ్డివెధవా! నిన్ను జైలుకు పంపిస్తానుచూడూ' అన్నారు ముసలాణ్ని గద్దించి కారులో ఎక్కుతూ.

ముసలాడు కుప్పలాగా కూలిపోయాడు. కుర్రాడు చనిపోయాడనే మాటలు మాత్రం అతని చెవుల్లో గింగురు మంటున్నాయి. అంతే!!!




## నా జీవితం

రచన: మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధి.
అనువాదం: పోలవరపు శ్రీరాములు.

ఇది సంస్కృతివారి 23వ ప్రచురణ. గాంధీజీ ఆత్మకథ ఆంగ్లంలో రెండు సంపుటాల పెద్ద గ్రంథం తయారైఉంది. దానిని పాఠశాలలలోని విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేటట్లు మహదేవ్ దేశాయ్ దీనిని సంక్షిప్తం చేసాడు. దీనిని సంస్కృతివారు తెలుగులో వడబోత వేయించారు. నిజానికి ఈ క్లుప్తీకరణ విద్యార్థి దశలోని వారికే ఎక్కువగా ఉపయోగిస్తుంది. అంతేకాక ఆంగ్లం రాని వ్యక్తులకు గాంధీజీవితం పరిచయమాతుంది. ఈ రెండు తెగల వారికి మాత్రమే ఈ అనువాద గ్రంథం బాగా ఉపకరిస్తుంది. శ్రీరాములుగారు మాతృకలో ఉన్నట్లుగానే చిన్న చిన్న వాక్యాలతో చక్కగా అనువదించారు. [వెల రూపాయిన్నర. కల్చరల్ బుక్ డిపో. పెరంబూర్ మద్రాస్.]

* * *

## ప్రకృతి వైద్యము

శ్రీ యోగాశ్రమము, మునుల తోట (మోర్తోట), [రేపల్లెతాలూకా గుంటూరు జిల్లా] వారి శ్రీ రామకృష్ణప్రకృతి చికిత్సాలయంయొక్క కేటలాగు ఈగ్రంథం. వెల అరణాలు.

* * *

## భారతాభ్యుదయం

ప్రకాశకులు శ్రీరామాబుక్ డిపో, మార్కెటు వీధి, సికింద్రాబాదు. గ్రంధకర్త శ్రీ భీమవరపు సాంబశివశర్మ. ఇది శ్రీ విద్యారణ్య చరిత్ర యక్షగానం. వెల అర్ధరూపాయి.